

**78**

**ధారావాహిక**

**జరిగిన కథ :**

భైరవ ఆత్మాహుతి జాయపుణ్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. ఎప్పుడూ లేనంతగా చలించిపోయాడు. కాకతి గుర్తొచ్చింది. భైరవ ఆత్మాహుతి తర్వాత మళ్లీ కనిపించలేదు. రుక్కమను, వెన్నియను పరామర్శించేందుకు అయ్యనవోలు వెళ్లాడు. రుక్కమను పరామర్శించాడు. అప్పుడే ఇంటి లోపలికి వచ్చిన వెన్నియ.. తలగుడ్డ తీసి ముఖం కప్పుకొని బావురుమన్నాడు. అతని వెనక కాకతి ఉన్నదోమోనని చూశాడు జాయపుడు. కానీ, అక్కడ ఎవరూ లేరు.

# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల


మత్తి భానుమూర్తి...

99893 71284


రుక్కమ ఇంట్లో అన్నీ వింటూ, చూస్తూ.. కాకతి రాక కోసం ఉత్కంఠగా ఉన్నాడు జాయపుడు. ఎవరెవరో వస్తు న్నారు. రుక్కమను ఓదార్చుతు న్నారు. అవేమీ పట్టించుకోకుండా.. కొడుకు కైలాసం వెళ్లిన ఆనందంలో ఉన్నదామె. అప్పుడన్నారు ఎవరో..

''కాకతి ఏది ఎన్నియా.. యాడుంది?''.

''అక్కడే అనుమకొండలోనే ఉందిగా. గుళ్లో అంగపూజలు చేస్తాంది. ప్చ్.. ఆ పిచ్చిదానికి పెళ్లికంటే, ఆ అమ్మోరిమీదే గురి ఎక్కువ'' అన్నాడు వెన్నియ.

సందేహంలో పడిపో యాడు జాయపుడు. కాకతి అక్కడే అను మకొండలో ఉన్నదా? మరి తనను కలవలేదే! భైరవ మరణానికి తనే కారణమని ఆమె అభిప్రాయమా!? అందుకే తనను కలవలేదా!? అయితే వెంటనే అనుమకొండ వెళ్లాలి. కాకతిని కల వాలి.

ముళ్లపై కూర్చున్నట్లు కాసేపు అక్కడే కూర్చున్నాడు. ఏదో మాట్లాడాడు. చాలాసేపు విన్నాడు. మెల్లగా కదిలి అశ్వాన్ని అధిరోహించాడు. అది మూడుకాళ్ల సవారీపై అనుమకొండ చేరింది. మధ్యరాత్రి వేళ భైరినాయకుడి తలుపు తట్టాడు. తలుపు తీసిన ఆ దంపతులు అంత రాత్రివేళ జాయపుణ్ని చూసి ఆశ్చర్యపోయారు.

''కాకతి?!!''.

''నేనే రేపు మిమ్మల్ని కలిసి అడుగుదామని అనుకుం టున్నా జాయపా! ఆ నాట్య ప్రదర్శన తర్వాత ఆమె మా ఇంటికి రాలేదు.

పాపం.. భైరవ ఆత్మాహు తికి ఆమె చాలా బాధప డుతున్నదేమో.. మీవెంటే ఉన్నదని భావిస్తున్నాం!'' అన్నాడు భైరినా యకుడు.

నిర్ఘాంతపోయాడు జాయపుడు.

'ఇదేమిటి!? కాకతి అటు అయ్యనవోలు వెళ్లక.. ఇక్కడ రేణుక ఇంటికి చేరక ఎక్కడికి వెళ్లినట్లు?'.. ఆలోచిస్తున్న కొద్దీ మనసు మొద్దుబారిపోతున్నది. ఎటు చూసినా చిమ్మచీకటి..

అశ్వాన్ని నడిపిస్తూ అనుమకొండ వీధులలో చాలా సేపు తిరుగాడాడు.

కాకతి.. కాకతి.. లిప్త లిప్తకూ ఆమె నామాన్నే ఉచ్చరి స్తున్నది మనసు. పెదవులు కూడా! ఘడియ ఘడి యకూ ఆమెపై భయం పెరిగిపోతున్నది. ఏమైనట్లు?? భైరవ మాటలు విన్న కాకతి నోరు కొట్టుకుంటూ తనను చూసిన చూపు.. మరుక్షణం భీతావహలా లోపలికి వేగంగా పరిగెడుతూ చూసిన చూపు..

ఆ చూపు.. మళ్లీమళ్లీ కళ్లముందు కదులుతున్నది.

శరీరమంతా ఏదో తెలియని భయవిహ్వాల భావనతో వణుకుతున్నది.

కాళ్లు ఆ దేవాలయం వైపు తీసుకుపోయాయి. అంతా నిశ్శబ్దం.. గాడాంధకారం.. నిశ్శబ్దంగా నిద్రపో తున్నది దేవాలయం.. సిద్ధేశ్వరాలయం!! సిద్ధేశ్వరుడైనా కాకతి జాడ చెబుతాడేమో..

లోపలికి వెళ్లాడు. మళ్లీ మళ్లీ ఆనాటి దృశ్యం మొత్తం సజీవంగా చుట్టూ కదలాడుతున్నది.

గాడాంధకారం. మంటపాలలో అక్కడక్కడా భక్తులు కాబోలు.. నిద్రపోతున్నారు. పెరడు, అంతరాలయం, కోష్టాగారం, అన్నీ అంతా.. చీకట్లో కళ్లే కాగడాలుగా వెతికాడు. లేదు.. కనిపించలేదు.

అలా మొదలైన వెతుకులాట రోజులు.. వారాలు.. పక్షాలు.. మాసాలు కొనసాగుతూనే ఉంది.

కాకతి కనిపించలేదు. కాకతి వార్త తెలియరాలేదు.

'అక్కడ చూశాం!' అన్నవారు లేరు. 'నాతో మాట్లా డింది' అన్నవారూ కనిపించలేదు. అందరూ తననే అడుగుతున్నారు. తనవైపే వేలెత్తి చూపుతున్నారు.

నిద్ర పట్టదు. ఊహల్లో సన్నిహితంగా వస్తుంది. పక్కనే ఉన్నట్లు తోస్తుంది. ముందు పల్లకిలో వెళ్తున్నట్లు అనిపిస్తుంది. వెతికితే ఉండదు. దూరంగా ఆ అంగ డిలో నిలబడినట్లు.. యుద్ధంలో కత్తి తిప్పుతున్నట్లు.. ఆ నాట్య ప్రదర్శనలో లాస్యం చేస్తున్నట్లు.. తోలుబొమ్మ లాటలో బొమ్మలా కదలాడుతున్నట్లు..